క్లుప్తంగా

నేడు బాలగోపాలం

కొడంగల్: పట్టణంలోని శ్రీ కేశవస్వామి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు బాలగోపాలం నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త వశిష్ట తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకృష్ణ వేషధారణలో మెప్పించిన ఎనిమిది మంది చిన్నారులకు ఒక్కొక్కరికి ఐదు గ్రాముల వెండి పతకాలను బహుమతిగా ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 94415 66051 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. గురువారం సాయంత్రం 6 గంటలకు డోలారోహణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారి పల్లకి సేవ, ఊరేగింపు, పెరుగు బసంతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



కైసర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్: పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు కైసర్‌ను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కై సర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుయాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ విష్ణువర్దన్, మాజీ సర్పంచ్‌లు రమేష్ బాబు, గౌసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న శ్రీనివాస్

పెద్దేముల్: గ్రామ అభివృద్ధితో పాటు పేదలకు నేనున్నానంటూ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పనిచేస్తున్నారని పెద్దేముల్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం పెద్దేముల్ మండల తింసాన్‌పల్లి గ్రామానికి చెందిన గోపాల్ కుమార్తె సంగీత అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకు తెలియచేయడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంగీత ఆరోగ్యం కోసం రూ.2.5లక్షల ఎల్‌ఓసి అందచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పెద్దేముల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, రఘు ,మాణిక్యం, చందర్,గయ్య, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్‌తో పాటు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



శ్రీ బాలాజీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

కొడంగల్ రూరల్: మండలవ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలకు సెలవు కావడంతో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఆలయాభివృద్ధికి సహకారం

కొడంగల్: పట్టణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తానని మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావ్ మాట్లాడుతూ ఆలయానికి మరమ్మతు చేయిస్తానని అన్నారు. కాలనీవాసులు సహకరిస్తే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో రెండో వార్డు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పేదలను విస్మరిస్తున్న కేంద్రం

అనంతగిరి: నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా దేశమంతా అమలు చేయాలన్నారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కేంద్రం పేదలను విస్మరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, చంద్రయ్య , రామకృష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం రోడ్లు.. లక్ష్యానికి తూట్లు

లక్షలు వెచ్చిస్తున్నా.. ప్రయోజనం సున్నా

- అధికారుల పర్యవేక్షణ కరవు
- ప్రజలు, వాహనదారులకు అవస్థలు

పెద్దేముల్: పదికాలాలపాటు గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం వివిధ పథకాల కింద నిధులను మంజూరు చేసింది. కానీ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ నిధులతో వేసిన సీసీరోడ్లు మున్నాళ్లకే పాడవుతున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులతో తూతూమంత్రంగా పనులు ముగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సీసీ రోడ్లపై మళ్లీ రోడ్లు వేస్తున్నారు. ఆరు ఇంచుల మందంతో వేయాలి. మూడు నాలుగు ఇంచులు మాత్రమే వేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా నాణ్యతను పరిశీలించకుండా అధికారులు బిల్లులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నాణ్యత లేని రోడ్లు

మండలంలో గ్రామాల అభివృద్ధికి ఎన్‌డీఎఫ్ నిధులతో పాటు పలు నిధుల ద్వారా సుమారు రూ.50 లక్షల వరకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మంజూరు చేయించారు. ఈ అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలి. సీసీ రోడ్లకు 50 శాతం ఇసుక, 50 శాతం శ్యాండు వేసి రోడ్లు వేయాలి. కానీ.. 100 శాతం రోబో షాండుతో సీసీ రోడ్లు వేస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నెలల వ్యవధిలోనే రోడ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గోపాల్‌పూర్, అడ్కిచెర్ల, ఉరేంటితండా, మంబాపూర్, కందనెల్లితండాతో పాటు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



ఉరేంటితండాలో పాడైపోయిన సీసీ రోడ్డు

ప్రజాధనం పక్కదారి

బండపల్లి గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ప్రభుత్వం ఎన్‌డీఎఫ్ కింద సుమారు రూ. 45 లక్షలు నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో కాలనీల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. అయితే పాత రోడ్లపై మళ్లీ సీసీ రోడ్లు వేస్తున్నారు. ఇదే విషయంపై మండల పీఆర్ ఏఈ సిద్ధార్థకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. గోపాల్‌పూర్ గ్రామంలో కొత్తగా వేసిన సీసీ రోడ్లు బీటలు వారుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని, ఉరేంటితండాలో వేసిన సీసీ రోడ్డు పది రోజులకే పాడైపోయిందని స్థానికులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ప్రజాధనం పక్కదారి పడుతోందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

బిల్లులు నిలిపేస్తాం

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతగా లేకుంటే చర్యలు తీసుకుంటాం. నాసిరకంగా ఉంటే బిల్లులు నిలిపేస్తాం. సీసీ రోడ్డు నాణ్యతపై విచారణ జరిపిన తర్వాత బిల్లులను ఆమోదిస్తాం. పనులను పరిశీలించిన తరువాతే బిల్లులు చేస్తున్నాం.

– సిద్ధార్థ, పంచాయతీరాజ్ ఏఈ, పెద్దేముల్ మండలం

ఓటు హక్కు వజ్రాయుధం



తాండూరు టౌన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణ అమిత్

జిల్లా సహాయ కలెక్టర్ నారాయణ అమిత్

తాండూరు టౌన్: యువతీ యువకులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ కలెక్టర్ నారాయణ అమిత్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, మనల్ని పాలించే వారిని ఓటేసి మనమే ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఓటరు కార్డును కలిగి ఉండాలన్నారు. లేకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం మాక్ పోలింగ్ స్టేషన్ నిర్వహణ, ఈవీఎంల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ కోటాజీ, ఆర్డీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఎంతో కీలకం

పెద్దేముల్: 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి ఓటును నమోదు చేసుకోవాలని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీయల్‌ఓలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుకు ఉన్న శక్తి దేనికి లేదని, ఎన్నికల సమయంలో ప్రతి పౌరుడికి ఓటు ఎంతో కీలకమన్నారు. ఇంతవరకు బీయల్‌ఓలు అందచేసిన ఫామ్–6,7,8,9ను పరిశీలించామని తెలిపారు. ఈ నెల 19 తేదీ వరకు కొత్త ఓటర్లు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

బొంరాస్‌పేట: ఎన్నికలు, వాటి నిర్వహణపై దుద్యాల మండల పరిధిలోని చిల్మల్‌మైలారంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఓటరు జాబితా, ఓటుహక్కు వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలోని 8, 9 తరగతుల విద్యార్థులు, ఎన్నికల అధికారి, పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించారు.

ఎంసీహెచ్‌లో ప్రసవాలు పెరగాలి

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి

తాండూరు టౌన్: మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో (ఎంసీహెచ్) ప్రసూతి కేసుల సంఖ్య పెరిగేందుకు అందరూ కృషి చేయాలని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి అన్నారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో జిల్లాలోని పలు పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తిస్తున్న మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు ఎంసీహెచ్ ప్రసూతి కేసుల సంఖ్యలో రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే ఈ సంఖ్యను మరింత పెంచి ప్రథమ స్థానంలో నిలిచేందుకు మెడికల్ ఆఫీసర్లు అందరూ కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులను ప్రసూతి కోసం ఎంసీహెచ్‌లో చేరేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా, పలువురు గైనకాలజిస్టులు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మూర్తి

వైభవంగా గోకులాష్టమి

- ఘనంగా జన్మాష్టమి
- కృష్ణుని వేషధారణలో చిన్నారులు
- ఉట్టికొట్టి సందడి చేసిన యువకులు

ధారూరు: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనేక ఆలయాల్లో శ్రీకృష్ణునికి శంఖాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకారాలు గావించారు. గోవులకు పసుపు, కుంకుమ పూసి నూతన వస్త్రాలతో అలంకరించారు. యువకులు ఉట్టికొట్టి సందడి చేశారు.

ధారూరులో..

ధారూరు మండల పరిధిలోని గురుదోట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం గురు పూజోత్సవం, శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేశాధారణలతో నృత్యాలు చేస్తూ వీధుల్లో తిరిగారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ అనిత గురు పూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు రాజేందర్, ఎల్లప్పలకు శాలువాలు కప్పి సన్మానించారు.

ఘనంగా క్రిష్టాష్టమి

మండలంలోని విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో క్రిష్టాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఆనందంగా పాలుపంచుకున్నారు.



ఉట్టి లాగుతున్న గొల్లభామలు

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: మండలంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు పాఠశాల్లో బాలురు కిట్టయ్యలుగా, బాలికలు గొల్లభామల వేషధారణలో సందడి చేశారు. అలాగే మరికొన్ని పాఠశాలల్లో ఉట్టికుండను చిన్నారి కిట్టయ్యలు కొట్టి సంబురంగా వేడుకను నిర్వహించారు. కిట్టయ్య పాటలకు చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి.

పరిగిలో..

పరిగి: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పరిగిలో మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో, సయ్యాద్‌మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో కృష్ణుని, గోపికల వేశధారణలో సంబరాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని వేశధారణ, గోపికల వేశధారణలో చిన్నారులు ఉట్టికొట్టారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ డివిజన్ కార్యదర్శి మహమ్మద్

పరిగి: రంగాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి మహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 18లో గల 9.39 ఎకరాల భూమిని రియల్టర్లు ఆక్రమించారని తెలిపారు. కబ్జాదారుల చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, రవి, నర్సింహులు, బలమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తండాల సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి

దుద్యాల బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చాంద్‌పాషా

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గంలోని గిరిజన తండాలు, మారుమూల పల్లెల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని దుద్యాల బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు చాంద్‌పాషా అన్నారు. బుధవారం హంసాన్‌పల్లి బీటీ రోడ్డు నుంచి నాన్‌చెర్వుతండా, సత్తర్‌కుండ తండా, బొల్లిబాయితండాల మీదుగా చెట్టుపల్లితండాకు రూ. 2 కోట్ల 60 లక్షల 80 వేల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నూతన బీటీరోడ్డు నిర్మాణానికి పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా భూమిపూజ చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శేరినారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ శాంతారెడ్డి

సర్పంచ్ శాంతారెడ్డి

దోమ: సమాజంలో గురువుకు ఎనలేని ప్రాధాన్యత ఉందని, వారి సేవలు సమాజంలో వెలకట్టలేనివని సర్పంచ్ శాంతారెడ్డి అన్నారు. బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని దిర్సంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు ప్రధాత ఉపాధ్యాయుడేనని, నవ భారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారని కొనియాడారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును మార్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపసర్పంచ్ శిరీష, పాఠశాల చైర్మన్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, వార్డు సభ్యులు రాజీవ్‌రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిత్య రుద్రాభిషేకం

కొడంగల్ రూరల్: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీ జగద్గురు నిరంజన మఠంలో శ్రీ బసవలింగేశ్వర స్వామికి నిత్య రుద్రాభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజు స్వామివారికి రుద్రాభిషేకం చేస్తూ.. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.

15న ముగింపు ఉత్సవాలు

మఠంలో 15వ తేదీన నిర్వహించనున్న శ్రావణ మాసం ముగింపు ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న ఉదయం 9గంటలకు స్వామివారికి బిల్వార్చన, 9–30 గంటలకు పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెడిసిన్‌లో మెరిసిన కొడంగల్ విద్యార్థి



వసంత్‌కుమార్

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన బి.వసంత్‌కుమార్ మెడిసిన్‌లో 499 మార్కులతో 1,09,791 ర్యాంకు సాధించి.. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు తెచ్చుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు రజిత, రాఘవేంద్ర మాట్లాడుతూ తమ కుమారుడు 10వ తరగతి వరకు శ్రీ సాయిపబ్లిక్ స్కూల్ హైదరాబాద్, ఇంటర్ శ్రీచైతన్య కళాశాలలో పూర్తి చేశాడని తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెడిసిన్ పరీక్షల్లో 499 మార్కులు సాధించాడని తెలిపారు. బుధవారం నిర్వహించిన చివరి విడత కౌన్సిలింగ్‌లో విద్యార్థి వసంత్‌కుమార్‌కు మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చిందని తెలిపారు.

పత్తికి తెగుళ్ల బెడద

మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి

పరిగి: పత్తి పంటకు వ్యాపిస్తున్న తెగుళ్లపై రైతులు జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పత్తి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు కురవడం, అధిక మోతాదులో యూరియ, కాంప్లెక్స్ ఎరువులు వాడటంతో పత్తిపంటలో పారా విల్ట్ తెగులు ఆశించిందని తెలిపారు. ఈ వ్యాధి వ్యాపించిన మొక్కలు వాడిపోతాయని, ప్రారంభం దశలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు.

నేడు భారత్ జోడో సమ్మేళన్

అనంతగిరి: జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గురువారానికి ఏడాది పూర్తవుతుంది. ఈ సందర్భంగా పీసీసీ పిలుపు మేరకు వికారాబాద్‌లో భారత్ జోడో సమ్మేళన్ పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆలంపల్లి దర్గా నుంచి ర్యాలీ ప్రారంభమై.. ప్రధాన వీధుల గుండా ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి ప్రసాద్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

గ్రామ కమిటీ ఎన్నిక

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం కిష్టంపల్లి గ్రామంలో బుధవారం నూతనంగా గ్రామ ముదిరాజ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా శిర్ప కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా లింగయ్య, శ్యామల, కోశాధికారిగా మల్లేశ్, కార్యదర్శులుగా మాధవులు, తిరుపతి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అసంపూర్తిగా మోమిన్‌పేట రోడ్డు

వీధి దీపాలేవి?

మోమిన్‌పేట: పేరుకే నాలుగు వరుసల రోడ్డు. మూడేళ్లుగా ఈ రోడ్డుపై అంధకారంలో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి రోడెక్కడమే భయానకం. ఈ పరిస్థితిలో వీధి దీపాలు లేకపోవడం ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. మోమిన్‌పేటలో నాలుగు వరుసల రోడ్డును నిర్మించి మూడేళ్లు అవుతున్న వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మోమిన్‌పేటలో రెండు కిలో మీటర్ల వరకు నాలుగు వరుసల రోడ్డు, మురుగు కాల్వ, రెండు కల్వర్టులు నిర్మించేందుకు సుమారుగా రూ.10 కోట్లు ఆరు సంవత్సరాల క్రితం మంజూరయ్యాయి. అయితే ఇప్పటివరకు సగం వరకు మాత్రమే సీసీ రోడ్డు వేసి, ఒక కల్వర్టు పనులను పూర్తి చేశారు. ఒక కల్వర్టు, బీటీ రోడ్డు నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. డివైడరు నిర్మించడంలో కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయని పనులు పూర్తి చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ


దోమ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. బుధవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వాహనదారులు ట్రాఫిక్ నింబంధలను ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లితండ్రులతో పాటు వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాస్, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం

పెద్దేముల్: అంబురామేశ్వర జాతరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ నెల 11న శ్రావణమాసం చివరి సోమవారం జాతరను నిర్వహించనున్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండడంతో అక్కడి భక్తులతో పాటు తాండూరు, వికారాబాద్, జహీరాబాద్ నుంచి భక్తులు అధికంగా పాల్గొంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేయనున్నారు. పెద్దేముల్ మండల తట్టెపల్లి గ్రామంలో కొలువైన అంబురామేశ్వర ఆలయంలో భక్తులు శ్రావణమాసంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. తట్టెపల్లి, పాషాపూర్, ఆత్కూర్‌తండా గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అంబురామేశ్వర స్వామి వెలిశారు. భక్తులకు స్వామి కొంగుబంగారంగా నిలిచారని భక్తుల విశ్వాసం.

రూ. 50లక్షలతో అభివృద్ధి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి పనులకు సుమారు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలియజేశారు. రూ.15 లక్షలతో ఆలయానికి వెళ్లే మెట్లు మార్గాన్ని నిర్మించారు. రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, రూ.9 లక్షలతో గుడి సమీపంలో భక్తుల కోసం షెడ్లు, రూ.10లక్షలతో ధర్మశాల స్లాబ్‌కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నెల 11 వరకు పనులు పూర్తి అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



తట్టెపల్లి అంబురామేశ్వర ఆలయం